# ఆదిలాబాద్ వార్త


మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 17, డిసెంబర్ 2025


### సింగరేణి నూతన సీఎండీగా

## కృష్ణ భాస్కర్ బాధ్యతల స్వీకరణ

✦ మాతృ విభాగానికి ఎన్. బలరాం ✦ నూతన సీఎండీకి ఘన స్వాగతం



**నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ నూతన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి దేవరకొండ కృష్ణ భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సింగరేణి సీఎండీ (పూర్తి అదనపు బాధ్యతలు)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సీఎండీగా విధులు నిర్వర్తించిన ఎన్. బలరాం తన ఏడు సంవత్సరాల డెప్యుటేషన్ కాలం ముగియడంతో మాతృ విభాగానికి తిరిగి వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఎన్. బలరాం నుండి కృష్ణ భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు నూతన సీఎండీకి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం మిగతా 2లో..



# జిల్లాలో మావోయిస్టుల కలకలం..

## 16 మంది మావోయిస్టుల అరెస్టు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

కుమ్రం భీం జిల్లాలో 16 మంది మావోయిస్టులను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. సిర్పూర్(యూ) మండలం పెద్దదోబ అటవీ ప్రాంతంలో తలదాచుకుని ఉన్నరన్నా సమాచారం మేరకు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించి వారిని అదుపులోకి తీసుకొని పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

- ఛతీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి కొత్త స్థావరం ఏర్పాటులో విఫలం
- అరెస్టైన వారిలో మావోయిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావుతో సహా 15 మంది మావోయిస్టులు
- 9 మంది స్త్రీలు, 7 గురు పురుషులు
- సిర్పూర్(యూ) మండలంలో తలదాచుకున్న మావోలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- డీజీపీ కార్యాలయానికి తరలింపు..!
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు..!

2లో..

### మూడవ విడత పంచాయతీ ఎన్నికలకు

## కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

★ శాంతియుత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

★ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ మూడవ విడత సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల లలో మూడవ విడుత 04 మండలాలలో 91 గ్రామపంచాయతీలు 852 పోలింగ్ కేంద్రాలలో, 121 పోలింగ్ లొకేషన్స్, మంచిర్యాల జోన్ పరిధిలో మంచిర్యాల జోన్ పరిధిలో భీమారం, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, మందమర్రి 05 మండలాలలో102 గ్రామపంచాయతీలు, 868 పోలింగ్ కేంద్రాలలో,128పోలింగ్ లొకేషన్స్. మొత్తం రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధి లో 1720 మొత్తం పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు 1167, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 563 కలవు. మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు డీసీపీ 02, ఏసీపీ 07, సీఐలు 32, ఎస్ఐలు 97, ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు 270, కానిస్టేబుళ్లు 520, హోం గార్డులు 240, ఆర్మడ్ సిబ్బంది 190, క్యూ ఆర్ టీమ్స్ 54, రూట్ మిగతా 2లో..

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయి ఏర్పాట్లు

✪ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే





**ఆసిఫాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తుది విడత ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగే విధంగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3వ విడత గ్రామపంచాయతీ సర్పంచ్, మిగతా 2లో..

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయి ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. తుది విడతలో ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, కాగజ్ నగర్ మండలంలోని 108 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 2 స్థానాలు ఏకగ్రీవం కాగా 2 స్థానాలకు నామినేషన్లు రానందున 104 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 938 వార్డు సభ్యుల స్థానాలకు గాను 186 స్థానాలు ఏకగ్రీవం కాగా 8 స్థానాలకు నామినేషన్ దాఖలు కానందున 744 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మూడో విడత ఎన్నికలలో 61252 మంది పురుషులు, 61141 మంది మహిళలు, 6 మంది ఇతరులు మొత్తం 122429 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో భాగంగా 1079 మంది పోలింగ్ అధికారులు, 1241 మంది ఇతర పోలింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారని, 4 మండలాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు 27 మంది జోనల్ అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఫలితాల వెల్లడి అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత కార్మికులకు లాభాల వాటా ఇవ్వకపోవడం దారుణం

నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా, పిఎల్ఆర్ బోనస్‌లను యాజమాన్యం వెంటనే చెల్లించాలని, లేనియెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం హెచ్చరించింది. మంగళవారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెగ్యులర్ కార్మికులకు లాభాల వాటా, పిఎల్ఆర్ బోనస్ చెల్లించి మూడు నెలలు గడుస్తున్నా, విశ్రాంత కార్మికులను విస్మరించడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ కార్మికుల శ్రమను గౌరవించకుండా, మానవత్వం మరిచి ప్రవర్తించడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం సంస్థకు సంబంధం లేని అంశాలపై కోట్ల రూపాయలను వృధా చేస్తూ, కార్మికులకు న్యాయంగా రావాల్సిన డబ్బును ఆపడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు సూటిగా ప్రశ్నించారు. తక్షణమే విశ్రాంత కార్మికులకు లాభాల వాటా, పిఎల్ఆర్ బోనస్ ప్రకటించాలని, లేనిపక్షంలో రిటైర్డ్ కార్మికులను కలుపుకొని సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని జిఎం కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## 3వ విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త



2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలో జరగనున్న 3వ విడత ఎన్నికల కొరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండు విడతల ఎన్నికలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని, ఈ క్రమంలో 3వ విడత ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఫలితాల వెల్లడి అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 3వ విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని చెన్నూర్, మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఇందులో 102 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 390 నామినేషన్లు వచ్చాయని, 4 స్థానాలు ఏకగ్రీవం కాగా 98 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. 868 వార్డు సభ్యుల స్థానాలకు గాను 1 వేయి 905 నామినేషన్లు వచ్చాయని, 4 స్థానాలలో నామినేషన్లు రాకపోవడం / సరైన నామినేషన్లు సమర్పించకపోవడం మినహాయించి 153 స్థానాలు ఏకగ్రీవం కాగా 711 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికలలో 52 వేల 810 మంది పురుషులు, 54 వేల 75 మంది మహిళలు, 4 మంది ఇతరులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా, నిస్పక్షపాతంగా వినియోగించుకోవాలని తెలిపారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి సంస్థకు గర్వకారణం

**- శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 56వ రక్షణ పక్షోత్సవాలు - హాజరైన ఉన్నతాధికారులు**

నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

రక్షణ ప్రమాణాలను పాటిస్తూ అధిక ఉత్పత్తిని సాధించడం సంస్థకు గర్వకారణమని, రక్షణతో కూడిన ఉత్పాదకతే సంస్థ ప్రధాన లక్ష్యమని సింగరేణి ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రక్షణ వారోత్సవాల తనిఖీ కమిటీ కన్వీనర్, జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డి) చిట్టా వెంకటరమణ, జనరల్ మేనేజర్ (సేఫ్టీ, బెల్లంపల్లి రీజియన్) రఘు కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియా మొత్తం బొగ్గు ఉత్పత్తిలో సుమారు 54 శాతం వాటా ఉపరితల గనిదేనని ప్రశంసించారు. భవిష్యత్తులో చిన్న ప్రమాదం కూడా జరగకుండా ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలన్నారు. విధులకు హాజరయ్యే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మస్టర్ సమయానికి ముందే గనిని చేరుకొని పనిని ఆరంభించాలని సూచించారు. ముఖ్యంగా షావల్స్, డంపర్ల వంటి భారీ యంత్రాలు నడిపే సమయంలో ఎస్.ఓ.పి ప్రకారం రక్షణ పద్ధతులను కఠినంగా పాటించాలని, పనిలో తొందరపాటు వద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన సి.పి.ఆర్ విధానం, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, గని ప్రాజెక్ట్ అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు, గని మేనేజర్ ఇందూరి శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, గని రక్షణాధికారి శ్రీధర్, సంక్షేమ అధికారి ఓంకార్ బాబు, పిట్ కార్యదర్శి లచ్చన్న, రక్షణ కమిటీ సభ్యులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం చిట్టా వెంకటరమణ, పక్కన ఇతర అధికారులు

## జిల్లాలో మావోయిస్టుల కలకలం..

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేషన్ కాగార్‌లో బాగంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై ప్రత్యేక దృష్టి సారించడంతో మావోయిస్టులు వారి స్థావరాలను మారుస్తున్నారు. ఈ క్రమంలో పోలీసు నిఘా విభాగం సమాచారంతో సిర్పూర్(యూ) ఆడవుల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహించి వారి స్థావరాన్ని కనిపెట్టి చాకచాక్యంగా వ్యవహరించి 16 మంది మావోయిస్టులను ఆదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను చత్తీస్‌ఘడ్ చెందిన వారుగా గుర్తించారు. పట్టుబడిన వారిలో తొమ్మిది మంది మహిళ మావోయిస్టులు కాగా ఏడుగురు పురుషులు ఉన్నారు. అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను హైదరబాద్ డిజీపీ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

## సింగరేణి నూతన సీఎండీగా కృష్ణ భాస్కర్ బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

పలికారు. కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీగా, తెలంగాణ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బహుళ బాధ్యతలతో పాటు ఇప్పుడు సింగరేణి పగ్గాలు కూడా చేపట్టారు.

## మూడవ విడత పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

(మొదటిపేజీ తరువాయి)

మొబైల్ పార్టీలు 57,మిగతా సిబ్బంది సుమారు 200 మంది, మొత్తంగా సుమారు 1700 మంది పోలీస్, భద్రతా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు, సున్నితమైన క్రిటికల్, అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది ఏర్పాటు తోపాటు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఓటింగ్, కౌంటింగ్ సమయంలో పరిస్థితిలను నిరంతరం గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచడం జరిగింది అని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, బెదిరింపులు, గొడవలు, అక్రమ మద్యం, డబ్బు పంపిణీ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

## భద్రతా చర్యలు మరింత బలోపేతం

ఆసిఫాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు జరిగే మండలాల్లో భద్రతా చర్యలు మరింత బలోపేతం చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న జరిగే గ్రామపంచాయతీ మూడవ విడత ఎన్నికల సందర్భంగా మండలాల వ్యాప్తంగా బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా పరిధిలోని ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాని, కాగజ్ నగర్ మండలాలలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. ఎన్నికల ముందు భద్రతా పరిస్థితిని సమగ్రంగా సమీక్షిస్తూ, పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాపులు, ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వంతెనలు, బస్ స్టాండ్లు, గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 795 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడరాదని, జిల్లా పోలీసులు ఎన్నికల భద్రతాపై పూర్తి దృష్టి పెట్టినట్టు తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు స్క్వాడ్ బృందం



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య అధికారి అనిత

## పోలింగ్ కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరాలు

**- డిఎంహెచ్ఓ అనిత**

జైపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

చెన్నూర్ నియోజకవర్గంలో నేడు జరగనున్న మూడో విడత సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య ఆరోశ్యిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత మంగళవారం తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటన వైద్య సేవలు అందిజెస్తామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సందర్శించి,సిబ్బందికి సూచనలు చేశారు.వైద్యులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 6 గంటలకు రిపోర్ట్ చేయాలని, సెల్ ఫోన్లు వెంట తీసుకువెళ్లరాదని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక నాయకులతో గానీ తెలిసిన వారితో గాని ప్రజాప్రతినిధులతో గాని మాట్లాడరాదని ఆదేశించారు. వైద్య శిబిరంలో 108 అంబులెన్స్, ఆర్.పి.ఎస్.కే బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ముస్తాఫా, వంశీకృష్ణ, అధికారి శ్రీనివాస్ స్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు

## సంపూర్ణ మద్యపాన నిషేధంకై యువకుల ప్రతిజ్ఞ

బెజ్జూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని తలాయి గ్రామంలో మంగళవారం యువకులు,గ్రామస్తులు సంపూర్ణ మద్యపాన నిషేధం కొరకు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా వారు గ్రామంలో చాలామంది కల్తీ మద్యం తాగడం వల్ల మృతి చెందారని అందువల్ల గ్రామంలో గుడుంబాతో పాటు లిక్కర్ కూడా అమ్మకూడదని తీర్మానించారు.గ్రామంలో కల్తీ మద్యం ఏరులై పారుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని ఈరోజు నుండి ఎవరు కూడా గుడుంబా,లిక్కర్ అమ్మకూడదని వాటిని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు వారు తెలిపారు.గ్రామంలో మద్యాన్ని నిషేధించిన తర్వాత ఎవరైనా అమ్మినట్లయితే 10వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని,అమ్ముతున్నట్లు ఎవరైనా సాక్షాదారాలతో తెలిపినట్లైతే వారికి 500 రూపాయల బహుమతి ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

# సింగరేణి పరిరక్షణ సమితిగా ఏర్పడి సంస్థను కాపాడుకుందాం

**- సింగరేణికి రావాల్సిన రూ. 45 వేల కోట్లు తక్షణమే చెల్లించాలి - కొత్త బ్లాకులు సంస్థకే దక్కాలి**

**- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య**

నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త




సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య, పక్కన ఇతర నాయకులు

సింగరేణి సంస్థ మనుగడ కోసం అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఏకమై సింగరేణి పరిరక్షణ సమితిగా ఏర్పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తితో సింగరేణిని కాపాడుకోవాలన్నారు. సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులు వస్తేనే భవిష్యత్తు ఉంటుందని, ముఖ్యంగా మణుగూరు ఓసీ2 విస్తరణ బ్లాక్‌లో 60 మిలియన్ టన్నుల ఖబి' గ్రేడ్ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని తెలిపారు. ఈ బ్లాక్ సింగరేణికి దక్కితే ఆ ప్రాంతానికి మరో 20 ఏళ్లు ఢోకా ఉండదన్నారు. అయితే వేలంలో ఈ బ్లాక్‌ను దక్కించుకోవడానికి మరో ఆరు కంపెనీలు పోటీ పడుతున్నాయని, వాటిని అడ్డుకొని ఆ బ్లాక్ సింగరేణి సొంతమయ్యేలా చూడాలని కోరారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి చొరవ తీసుకొని వేలం నుండి జెన్‌కో సంస్థ విరమించుకునేలా కృషి చేయాలన్నారు. కోయగూడెం, సత్తుపల్లి ఓసీలను కూడా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ. 45 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, సంస్థ ఆర్థిక పటిష్టతకు ఈ నిధులు కీలకమని అన్నారు. అలాగే, సీఎస్ఆర్, డిఎంఎఫ్‌టి నిధులను కేవలం సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలని, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిల చెల్లించేలా, మెడికల్ బోర్డు నిర్వహణకు ఐఎన్‌టియుసి నాయకులు కృషి చేయాలని, అనవసరంగా గుర్తింపు సంఘంపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణ సాధనలో, కాంగ్రెస్ గెలుపులో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు సింగరేణి పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. గత ఎన్నికల్లో సింగరేణి పరిరక్షణకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కే. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కె బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమరయ్య, నాయకులు గునిగంటి నర్సింగరావు, అఫ్రోజ్ ఖాన్, విజయలక్ష్మి, సదానందం, అనంతరెడ్డి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

నస్పూర్ పట్టణంలోని మనోరంజన్ సముదాయంలో రేపు ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రధానంగా బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రాంత ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## క్యాన్సర్ వ్యాధితో సిఆర్‌టి ఉద్యోగి మృతి

సారంగాపూర్, డిసెంబర్16, ప్రభాతవార్త:

మండలంలోని రామ్‌సింగ్‌తండాకు చెందిన జాదవ్ దిలీప్(33) సీఆర్‌టి పిటిగా ఆశ్రమ హై స్కూల్ బాయ్స్ నిర్మల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. అతనికి బోన్ క్యాన్సర్ వ్యాధి బాదపడుతూ చికిత్స చేసుకున్న నయం కాకపోవడంతో మరణించారు. అతనికి భార్య ఒక కుమారుడు(08), కుమార్తె(10) ఉన్నారు. అతిపిన్న వయసులోనే మరణించడంతో గ్రామ ప్రజలు చింతిస్తున్నారు. ప్రభుత్వం వీరి కుటుంబానికి ఏదైనా ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



## పొనకల్ సర్పంచ్‌గా గెలుపొందిన జక్కు సుష్మ భూమేష్‌కు సన్మానాల వెల్లువ

జన్నారం, డిసెంబర్ 16, ప్రభాతవార్త

జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయితి ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన జక్కు సుష్మ భూమేష్‌కు సన్మానాల వెల్లువ నిరంతరం కొనసాగుతూ ఉంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చెసి అత్యంత భారీ మెజారిటీ 2919 ఓట్లతో విజయం సాధించి పెట్టిన ప్రజలు అభిమానులు, ఇంకా తమ అభిమానాన్ని సన్మానాలతో వ్యక్తపరుస్తున్నారు. గత పంచాయితి ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన జక్కు భూమేష్ చేసిన అభివృద్ధిని చూసి చాలా అభిమానాన్ని పెంచుకున్న ప్రజలు ఈసారి జనరల్ మహిళా రిజర్వేషన్ రావడంతో తన భార్య జక్కు సుష్మ భూమేష్‌ను పోటీలో నిలిపారు. ఈ ఎన్నికల్లో తన భర్త భూమేష్ చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, తన గురించి ఎంత చెడుగా చెప్పిన నమ్మకుండా 2919 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంతటితో ఊరుకోకుండా రోజు రోజుకు గ్రామంలోని అన్ని కుల సంఘాలు, వ్యాపార సంఘాలు, ఆటో యూనియన్లు, కాలనీ వాసులు సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్‌ను సన్మానించి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ రోజు మండల టూ వీలర్ మెకానిక్ సంఘం అధ్యక్షుడు బాలిన మధు ఆధ్వర్యంలో పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్ దంపతులను, ఉప సర్పంచ్ అప్పాల జలపతి, 2 వ వార్డు మెంబర్ పిల్లి మల్లయ్య లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ జక్కు సుష్మ భూమెష్ మాట్లాడుతు మీకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటానని, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రహీమ్, కోశాధికారి లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి ఇమ్రాన్, రాము, జావేద్, లచ్చన్న, నరేష్ తదితరులు ఉన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను కొనసాగించాలి

ఆసిఫాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

ఆసిఫాబాద్ మండలంలో జరుగుతున్న మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మంగళవారం ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ ప్రజలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా గుంపులు గుంపులుగా ఎవరు రావద్దని సూచించారు. ఓటు వేసే ప్రతి ఒక్కరు తమ గుర్తింపు కార్డును తీసుకుని వచ్చి ఓటు వేయాలని తెలిపారు. ఎన్నికల అనంతరం లెక్కింపు ప్రక్రియ కూడా కొనసాగుతున్నందున ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎన్నికల నియమావళికి ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గెలిచిన అనంతరం అభ్యర్థులు ఏలాంటి విజయోత్సవ ర్యాలీలను నిర్వహించడానికి అనుమతి లేదని ఎస్హెచ్ఓ తెలిపారు.



సూచనలు చేస్తున్న ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

## - సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు

**దహెగాం, డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

దహెగాం మండలంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సిర్పూర్ టీ ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. ముందుగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. మండలంలోని బీజేపీ పార్టీ బలపర్చిన అభ్యర్థులు రాపర్తి జయలక్ష్మి ధనుంజయ్, దండేరా శంకర్, నాయికిని సత్యనారాయణ, వెన్నంపల్లి స్రవంతి సుధాకర్, ఇస్లావత్ గోపాల్, కొద్దని మల్లక్క శ్రీనివాస్, మానేపల్లి పెంటయ్య, దుర్గం మల్లేశ్వరి ప్రభాకర్, కనక శకుంతల వీరందరు బీజేపీ పార్టీ తరుపున బరిలో దిగి సర్పంచులుగా గెలుపొందరు వీరికి ఎమ్మెల్యే దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ నిత్యం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేయాలనీ సూచించారు. సర్పంచులుగా అధికారం వచ్చిందని అహంకారన్ని దరి చేరానివ్వకుండా, అధికార దుర్వినియోగం చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవ చేస్తూ మన్నలను పొందాలన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి నిర్వహించాలని అన్నారు. ఓడిపోయిన అభ్యర్థులు ఎవరు కూడా అధైర్యం పడవద్దని రానున్నకాలంలో అవకాశాలు వస్తాయని, గెలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నూతన సర్పంచులతో ఎమ్మెల్యే హరీష్ బాబు

## నేడు పత్తి కొనుగోలు కేంద్రాలకు సెలవు

**నేరడిగొండ, డిసెంబర్ 16, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా నేరడిగొండ, పోచ్చేరా, బోథ్, సోనాల ప్రాంతాలోని సీసీఐ, పత్తి జీన్నింగ్ మిల్లులు బుధవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, ఆయా కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సన్మానించిన పత్తి రెడ్డి

**సారంగాపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో సారంగాపూర్ సర్పంచ్ కోనేరు భూమన్న, అడెల్లి సర్పంచ్ దండు సాయన్న, ఉపసర్పంచ్ నందు, కౌట్ల(బి) ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డిలను మాజీ జెడ్పిటిసి పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి వీరిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం మండల కాంగ్రెస్ సర్పంచులకు, ఉపసర్పంచులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీరు మీ గ్రామాభివృద్ధికి నిరంతరంగా కృషి చేయాలని అందుకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్ మాజీ అడెల్లి సర్పంచ్ రాజేశ్వరరావు, మాజీ ఆడేల్లి పోచమ్మ చైర్మన్ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎంసి వైస్ చైర్మన్, వార్డు మెంబర్లు

**జన్నారం, డిసెంబర్ 16, ప్రభాతవార్త**



మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఇద్దరు వార్డు మెంబర్లు మోసిన్ షా ఖాన్, ఎంఎ రజ్జాక్, ఏఎంసి వైస్ చైర్మన్ సయ్యద్ ఫసీ ఉల్లా మర్యాదపూర్వకంగా ఖనాపూర్ ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిశారు. పొనకల్ మేజర్ గ్రామ పంచాయితిలోని 4వ వార్డు నుండి గెలుపొందిన ఎంఏ రజ్జాక్, 8వ వార్డు నుండి గెలుపొందిన మోసిన్ షా ఖాన్‌లను, అలాగే ఏఎంసి వైస్ చైర్మన్ సయ్యద్ ఫసి ఉల్లాను సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సంధర్బంగా అయన మాట్లాడుతూ మీకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎప్పుడూ ప్రజాక్షేత్రంలో తిరుగుతూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించే దిశగా ప్రయత్నించాలని అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన ఎల్లప్పుడూ ముందుండి నేనున్నానంటూ భరోసా కల్పించాలని అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కృషి చేయాలన్నారు.



పోలీస్‌లకు సూచనలు ఇస్తున్న డీసీపీ భాస్కర్

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ చర్యలు ఉండాలి

### - మంచిర్యాల డీసీపీ భాస్కర్

**జైపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ సిబ్బంది సమన్వయంతో ప్రణాళిక ప్రకారం పని చేయాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. మూడో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తుకు జైపూర్ మండల పరిధిలో విధులకు హాజరు ఆవుతున్న సిబ్బందికి మంగళవారం ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎలాంటి నిరక్ష్యం వహించరదాని పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని అన్నారు. వంద మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్, వార్డుల అభ్యర్థులు, అనుమతి కలిగిన ఏజెంట్లను మాత్రమే కేంద్రాలలోకి అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులే గ్రామ ప్రగతికి కేంద్రబిందువు

### - ఎమ్మెల్యే హరీష్ బాబు

**పెంచికల్ పేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:**

పెంచికల్ పేట్ మండలంలో రెండో విడతలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి పార్టీ నుండి విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలావుతున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలని, ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను ప్రత్యేక్షంగా తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో పారదర్శక పాలనతో పాటు మోలిక వసతులకు ప్రాధన్యత కల్పించాలన్నారు. ప్రజ సమస్యల పరిష్కారంలో తమవంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమములో నూతనంగా ఎన్నికైన సర్పంచులు చప్పిడి రవీందర్, భక్తు రాంచంధర్, అన్నం రుక్మబాయి, కృష్ణవేణి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

**సారంగాపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:**

మండలంలోని మల క్చించోలి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్స వం ఆలయ ధర్మకర్త శక్కరి భగవతి పద్మనాభ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పుణ్యవచనం, ప్రత్యేక అభిషేకం, యజ్ఞం, కళ్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బుచ్చన్న ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం గ్రామ వీడిసి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య

**ఆసిఫాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యాభ్యాసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిత్యవసర సరుకుల నాణ్యత, మెనూ అమలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర మోలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ పౌష్టిక ఆహారంతో కూడిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో మధ్యాహ్న భోజనం తయారీలో పరిశుభ్రత నిబంధనలను పాటించడంతో పాటు ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన రుచికరమైన ఆహారం అందించాలని, నిత్యవసర సరుకులు భద్రపరిచే గది పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సరకుల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి

# ఎన్నికల నేపథ్యంలో కఠిన ఆంక్షలు

## సెక్షన్ 163 అమలు - ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, డిసెంబర్16, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీలకు నిర్వహించనున్న రెండవ సాధారణ ఎన్నికలు-2025ను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023లోని సెక్షన్ 163ను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ మేరకు ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీలకు మూడవ దశ పోలింగ్‌ను డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు.



### పోలింగ్, కౌంటింగ్ వరకూ ఆంక్షలు

ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా సాగేందుకు డిసెంబర్ 16 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 18 ఉదయం 10 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని కలెక్టర్ వివరించారు.

### సమావేశాలు, ప్రచారాలపై నిషేధం

ఎన్నికల సమయంలో చట్టవిరుద్ధ సమావేశాలు, బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. సినిమా, టెలివిజన్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం చేయరాదని, ప్రజలను ఆకర్షించే ఉద్దేశంతో సంగీత కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు, నాటక ప్రదర్శనల ద్వారా ప్రచారం నిషిద్ధమని తెలిపారు.

### మద్యం, వాహనాలపై నియంత్రణ

ఎన్నికల దృష్ట్యా మద్యం విక్రయం, రవాణా, వినియోగంపై ఎక్సైజ్ చట్టం ప్రకారం ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వాహనాలు ఏర్పాటు చేయడం నేరమని స్పష్టం చేశారు.

### పోలింగ్ కేంద్రాల వద్ద నిషేధాలు

పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం, మొబైల్ ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్ల వినియోగం, ఆయుధాలతో సంచారం, అనధికార వాహనాల వినియోగం పూర్తిగా నిషేధించబడుతాయని కలెక్టర్ హెచ్చరించారు. ఏ పోలింగ్ ప్రాంతంలోనైనా ఐదుగురికి మించి గుమిగూడడంపై నిషేధం అమల్లో ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీల మూడవ దశ పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంతంగా సాగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల సమయంలో పూర్తి సహకారం అందించి ప్రజాస్వామ్య విజయానికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

# ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో జరగనున్న 3వ విడత ఎన్నికల కొరకు పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం అంకుశాపూర్, రెబ్బెన మండలం ఖైర్గాం, ఆసిఫాబాద్ మండలం రాజంపేటలలో ఏర్పాటు చేసిన 3వ విడత ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 3వ విడతలో భాగంగా ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, కాగజ్ నగర్ మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన కనీస సౌకర్యాలు, విద్యుత్, త్రాగునీరు, రాంప్ సదుపాయాలను కల్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు జరిగేలా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే

**సిర్పూర్ (టి), డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

రెండవ విడత ఈనెల 14న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిర్పూర్ మండలం నుంచి బిజెపి పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన సర్పంచులు ఉపసర్పంచులను మంగళవారం రోజున స్థానిక మండల కేంద్రంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో శాసనసభ్యులు పాల్వాయి హరీష్‌బాబు నూతన సర్పంచులు ఎన్నికైన వారందరికీ శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేయాలని వారికి సూచించారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి దిశలో తీర్చిదిద్దాలని ఆయన తెలిపారు. సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా ఓడ్డెట్టి నాగమణి ఆచెల్లి సర్పంచ్ రాచర్ల రజిని పారిగాం సర్పంచ్ చనకపురి లావణ్య లోనవెల్లి సర్పంచ్ కంట్లంసంతోష్ ఇటుకల పహాడ్ తానుబాయ్ గోపాలపట్నం కొరుపెత్త రాజారాం ఉపసర్పంచులుదుర్గం ప్రశాంత్ కేడ సతీష్ గాడి శేఖర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వొడ్డటి నానయ్య పైడి విలాస్ నేరెళ్ల అశోక్ రామవోని శ్రీనివాస్ గౌడ్ మల్లికార్జున గౌడ్ శ్రీశైలం మహేష్ రాజశేఖర్ బండ రవి ఎకోన్కార్ విలాస్ శివ తదితరులు పాల్గొన్నారు.



నూతన సర్పంచ్‌లతో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

# సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్**

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

కొత్తపల్లి వెంకట లక్ష్మీ-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సొసైటి వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్- డాక్టర్ కొత్తపల్లి అనిత అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆసుపత్రిలో సొసైటి ఆధ్వర్యంలో ఉచితం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 26 మంది హాజరు కాగా వారిలో 8 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి 14 మందికి ఆపరేషన్ కోసం మంగళవారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించినట్లు తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపి కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్‌ను పార్టీలో చేర్చుకుంటే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తాం

**తాండూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం3 ఇంక్లైన్ గ్రామ పంచాయితీ సర్పంచ్ గా గెలిచిన చందనాల రవి కుమార్ ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అన్నారు. మాదారం త్రీ ఇంక్లైన్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని ఒక నాయకుడి ద్వారా కాంగ్రెస్ పార్టీ లోకి రావడానికి సర్పంచ్ రవికుమార్ ప్రయత్నాలు చేస్తున్నడన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సర్పంచ్ ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దని కోరారు. నాయకులు, కార్యకర్తల మాట వినకుండా ఎమ్మెల్యే సర్పంచ్ ను పార్టీలో చేర్చుకుంటే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మాదారం 3 ఇంక్లైన్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పుట్ట శ్రీనివాస్, ఐ ఎన్ టి యు సి బెల్లంపల్లి ఏరయా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కడారి రత్నాకర్ రావు, వార్డు మెంబర్ గొర్లపల్లి కమలాకర్, నాయకులు పుల్లవేణి సాయి కుమార్, రాజ శేఖర్, దొంతరవేణి రామచందర్, దర్శనాల సంతోష్, కొండగోర్ల అంజి, సురేష్,నరేష్, అశోక్, సంతోష్, రెడ్డి కిరణ్, మాణిక్ రావు ,షేర్ల సాయి, రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు, కార్యకర్తలు

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**తిర్యాని, డిసెంబర్ 16, ప్రభాతవార్త**



మండలంలోని 29 గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల మండల సహాయ అధికారి, ఎంపిడివో వేముల మల్లేష్ తెలిపారు. మండలంలో 222 పోలింగ్ కేంద్రాలు, ఆరు జోన్లు, ఆరు రూట్లు, 29 మంది రిటర్నింగ్ అధికారులతో పాటు పోలింగ్ అధికారాలు, ఓపిఓలు, స్టేజ్ 2 ఆర్వోలను నియమించామన్నారు. మండలంలో జరగనున్న మూడవ విడత సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు, తదితర సామాగ్రిని ఎన్నికల అధికారులు, సిబ్బంది సాయుధ పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. మండల సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడివో మల్లేష్ పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. కాగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తిర్యాని ఎస్సై సిహెచ్ వెంకటేష్ తెలిపారు.

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో వెల్ బేబీ షో

**జైపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

సింగరేణి ఆవిర్భావ దినోత్సవాలలో భాగంగా మంగళవారం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని డిస్పెన్సరీలో ఖవెల్ బేబీ షో ఖ నిర్వహించారు. జనరల్ మేనేజర్ నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పిల్లలు మన భవిష్యత్తుకు పునాదులని, వారి శారీరక, మానసిక సామాజిక ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మనం చూస్తున్న చిన్నారుల చిరునవ్వులు, వారి చురుకుదనం మనం వారికి అందిస్తున్న మంచి పెంపకానికి సంరక్షణకు నిదర్శనమనితెలిపారు. ఈ ఖవెల్ బేబీ షోGG ద్వారా, ఆరోగ్యకరమైన పిల్లలను ప్రోత్సహించడంతో పాటు, తల్లిదండ్రులలో కూడా ఆరోగ్యకరమైన పెంపకంపై అవగాహన పెంచాలని ఆశిస్తున్నామన్నారు. పిల్లల ఎదుగుదలకు సంబంధించిన ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఇది ఒక మంచి వేదిక అని అన్నారు. వెల్ బేబీ షోలో పాల్గొన్న పిల్లలకి బేబీ కింగ్, బేబీ క్వీన్, ప్రిన్స్ 1, ప్రిన్స్ 2, ప్రిన్సెస్ 1, ప్రిన్సెస్2 కేటగిరిలో పోటీ నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల వైద్య నిపుణురాలు శైలజ, డిస్పెన్సరీ డాక్టర్లు డా.జానకి, డా. పవన్ పిల్లల ఎత్తు ,బరువు, వాక్సినేషన్ రిపోర్ట్స్, ఐడెంటిఫికేషన్ ఆఫ్ టాయ్స్ లాంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన పిల్లలకి సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీ.ఎం.ఓ.ఏ.ఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా, ఎస్.ఓ టు జిఎం శంకర్,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, మెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పిల్లలు పాల్గొన్నారు.



# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 42 శాతం రిజర్వేషన్లతో నిర్వహించాలి

**- బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు కోడూరి చంద్రయ్య డిమాండ్**

**జన్నారం, డిసెంబర్ 16, ప్రభాతవార్త**



రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 42 శాతం బిసి రిజర్వేషన్లతో నిర్వహించాలి అని బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు కోడూరి చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల ప్రయత్నమంతా విఫలమై పంచాయతీ సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికలు పాత బిసి రిజర్వేషన్ల పద్ధతిలో నిర్వహించడం బీసీలను తెలంగాణ రాష్ట్రంలో వంచించినట్లు జరిగినది అని ఇప్పుడు జరగనున్న ఎంపీటీసీ (మండల పరిషత్) జడ్పీటీసీ (జిల్లా పరిషత్) ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలని కోడూరి చంద్రయ్య కోరారు. గత రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి 60 సార్లకు పైగా పోయి వచ్చినప్పటికీ ఏఐసీసీ సమావేశాలలో గాని, పార్లమెంటు లోక్సభ సమావేశాల్లో గాని ఏఐసిసి నాయకులు బిసి రిజర్వేషన్ల బిల్లు గురించి ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించకపోవడం విచారించదగ్గ విషయం. మన తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులను ప్రతిపక్ష నాయకులను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాన మంత్రి గారిని కలిసి రిజర్వేషన్ విషయంలో ఒత్తిడి తీసుకురాక పోవడం కూడా ఇది రేవంత్ రెడ్డి నిరక్ష్య ధోరణిగా ఉందని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఢిల్లీ కాంగ్రెస్ నేతలు సుమారు 100 మంది పార్లమెంటు సభ్యులు గల కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా బిల్లు ప్రవేశపెట్టి బీసీ రిజర్వేషన్ల విషయంలో కొట్లాడాలని బిసి రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నరసయ్య, మూల భాస్కర్ గౌడ్ , జన్నారం మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్ , పొనకల్ గ్రామ మొదటి వార్డు సభ్యుడు ముధురుకోల్ల రవి, రెండవ వార్డ్ సభ్యుడు పిల్లి మల్లయ్య, పొనకల్ పట్టణ వడ్డెర సంఘం అధ్యక్షుడు కుంట మహేష్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు గోపి సత్యనారాయణ, జన్నారం మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు అయిలవేణి రవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందజేత

**మంచిర్యాల, డిసెంబర్ 16, ప్రభాతవార్త**



జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని డిఎమ్‌హెచ్ఓ ఆఫీస్ సూపర్డెంట్ విశ్వేశ్వర్ రెడ్డికి తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగాస్తుల సమస్యలు పరిష్కరించాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినతి పత్రము అందజేశారు. అనంతరం సభ్యులు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు సుమారు 500,600 మంది ఉన్నారని వీరందరికీ హైడ్రాక్స్ యూరియా, సోడామెంటు, పెంటిడ్స్, సప్లిమెంటరీ డ్రగ్స్ ప్రభుత్వ నిధుల నుంచి లేదా ఏం హెచ్ ఎమ్ నేషనల్ హెల్త్ మిషన్ నిధులనుంచి తెప్పించి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో ఉన్న ఈ వ్యాధిగ్రస్తులకు అందచేయాలని, అలాగే నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జనరల్ హాస్పటల్లో పెట్టే బ్లడ్ బ్యాంకులో బ్లడ్ కాంపోనెంట్స్ తీసుకుని సెలైన్ వాషెడ్ చేసిన ఎర్ర రక్తమును లైసెన్స్ తీసుకొని ఈ పేషెంట్లకు అందజేయాలని, ఈ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఐరన్ చిలేషన్ తెరఫీ మందులతో పాటు స్ప్లీనెక్టమీ కడుపులో బల్ల, గల్బాదర్లో చెదు పేగులో రాళ్ళు ఆపరేషన్లు చేయించాలని, డాక్టర్ హిమటాలోజీతో పాటు అన్ని రకాల అవయవాల ప్రత్యేక వైద్య నిపుణులతో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆఫీస్ సూపర్డెంట్ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యలన్నీ డి ఎమ్ హెచ్ ఓ దృష్టికి తీసుకుపోయి అలాగే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో పైన తెలిపిన విషయాలను పురస్కరించుకొని అనేక వినతి పత్రాలు అధికారులకు ఇవ్వడము జరిగినది, కానీ సమస్యలు పరిష్కరింపబడుటలేదని, రోజురోజుకు ఈ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారు వైద్యం అందక మృతి ఒడిలోకి చేరిపోతున్నారు ఈ వ్యాధులను అరికట్టడానికి ఐక్యరాజ్యసమితి మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ తల సేమియా దినము మే 8, ప్రపంచ సికిల్ దినము జూన్ 19 అవగాహన సదస్సులు నిర్వహించాలని,కానీ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2047 నాటికి వ్యాధి లేని భారతదేశముగా తీర్చిదిద్దాలని నిర్ణయించాయి కానీ పత్రికా ప్రకటనలకు మాటలకు పరిమితం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నీ అధికారులు పరిష్కరించని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చుంచు శంకర్ వర్మ, బండ అవినాష్, శారద, కనకయ్య, వలియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన రక్షణ పరికరాలు ఇవ్వండి

**- హెచ్ఎంఎస్ నాయకులు**

**నస్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికులకు నాణ్యమైన పనిముట్లు, రక్షణ పరికరాలు సకాలంలో సరఫరా చేయాలని హెచ్ఎంఎస్ నాయకులు సింగరేణి యాజమాన్యాన్నికోరారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో యూనియన్ అధ్యక్షులు తిప్పారపు సారయ్య, వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి పొన్నగంటి అశోక్ పలు డిమాండ్లను లేవనెత్తారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న సేఫ్టీ బూట్లు, టోపీలు నాసిరకంగా ఉన్నాయని, అవి త్వరగా పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వార్మ్ కోట్లను యూనియన్ నాయకుల ద్వారా కాకుండా, పిట్ స్టోర్స్ క్లర్క్ ద్వారా పంపిణీ చేయాలని, అలాగే కోల్ కట్టర్లకు నాణ్యమైన బిట్లు, భూగర్భ గని కార్మికులకు యూనిఫాంలు వెంటనే సరఫరా చేయాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.